సాక్షి
కాకినాడ

సోమవారం । 13 । ఫిబ్రవరి । 2023



బంగారు ఆభరణం సమర్పణ


మామిడికుదురు: శ్రీ విజయదుర్గమ్మ వారికి మెండా కొండలరావు, సుబ్బలక్ష్మి దంపతులు (మామిడికుదురు) ఆదివారం రూ.లక్ష విలువైన 2 కాసుల బంగారు బొందు సమర్పించారు.



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి నిత్యాన్నదానం ట్రస్టుకు కాకినాడ విశ్వ వింగ్స్ ఓవర్‌సీస్ కంపెనీ ప్రతినిధి తత్వ షణ్ముఖ్ రూ.లక్ష విరాళం సమర్పించారు.

డెల్టాలకు 6,895 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 6,895 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,030, మధ్య డెల్టాకు 1,325, పశ్చిమ డెల్టాకు 3,540 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.20 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

డీఈవోగా అన్నపూర్ణ బాధ్యతల స్వీకరణ



డీఈఓ అన్నపూర్ణను అభినందిస్తున్న సిబ్బంది

కాకినాడ సిటీ: జిల్లా విద్యాశాఖాధికారి(డీఈఓ)గా కేఎన్‌వీఎస్ అన్నపూర్ణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీ)గా పని చేసిన అనుభవంతో జిల్లాను రాష్ట్రంలోనే విద్యా శాఖ పరంగా అన్ని విధాలుగా ప్రగతి పథంలో నడిపిస్తానని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నాడు–నేడు, జగనన్న గోరుముద్ద, విద్యాదీవెన, వసతి దీవెన, విద్యాకానుక వంటి అన్ని ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలయ్యేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తానన్నారు. డీఈఓగా బాధ్యతలు చేపట్టిన అన్నపూర్ణను ఏడీ–2 నాగేశ్వరరావు, డీవైఈఓ ఆర్‌జే డానియల్‌రాజు, సమగ్రశిక్ష ఇన్‌చార్జి చామంతి నాగేశ్వరరావు, సూపరింటెండెంట్లు ఫణి, శ్రీనివాస్, సిబ్బంది అభినందించారు.

81.97 మీటర్లుగా ఏలేరు నీటిమట్టం

ఏలేశ్వరం: ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు ఆదివారం నాటికి నిలకడగా ఉన్నాయి. పూర్తి స్థాయి నీటిమట్టం 86.56 మీటర్లు కాగా, ప్రస్తుతం 81.97 మీటర్లుగా నమోదైంది. రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం 24.11 టీఎంసీలు కాగా 15.85 టీఎంసీల మేర నిల్వలు ఉన్నాయి. ఆయకట్టుకు 600, స్పిల్‌వే ద్వారా 350, విశాఖ నగరానికి 175, తిమ్మరాజు చెరువుకు 50 క్యూసెక్కుల చొప్పున నీరు విడుదల చేస్తున్నారు.

జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో నాగబాబుకు పతకాలు



నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పశ్చిమ బెంగాలోని మిద్నాపూర్‌లో ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకూ జరిగిన జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు చెందిన యాతం నాగబాబు పతకాలు సాధించాడు. 1,600 మీటర్ల పరుగులో బంగారు, 400 మీటర్ల పరుగులో కాంస్య పతకాలు కైవసం చేసుకున్నాడు. కాకినాడ వైద్య, ఆరోగ్య శాఖలో సబ్ యూనిట్ అధికారిగా పని చేస్తున్న నాగబాబు ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన పోటీల్లో కూడా ప్రతిభ చూపి పతకాలు సాధించడం విశేషం.



కళ్లు మిరుమిట్లు గొలిపే విద్యుద్దీప కాంతుల్లో పాదగయ క్షేత్రం

శివయ్య సంబరానికి సిద్ధం

- మహా శివరాత్రికి ముస్తాబవుతున్న పాదగయ
- 16న కుక్కుటేశ్వరస్వామి కల్యాణం
- 21 వరకూ ఉత్సవాలు
- విస్తృతంగా ఏర్పాట్లు

పిఠాపురం: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పిఠాపురం పాదగయ క్షేత్రం మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతోంది. ఈ నెల 16వ తేదీ గురువారం నిర్వహించనున్న అంకురార్పణతో ఉత్సవాలు ఘనంగా ప్రారంభం కానున్నాయి. ఈ క్షేత్రంలో వెలసిన కుక్కుటేశ్వర స్వామి వారికి లక్ష బిల్వార్చన, రాజరాజేశ్వరీ దేవికి లక్ష కుంకుమార్చనతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. స్వామి, అమ్మవార్లకు 16వ తేదీ ఉదయం 8 గంటలకు పంచామృతాభిషేకం చేసిన అనంతరం 9 గంటలకు అంకురార్పణ, ధ్వజారోహణం గావిస్తారు. శ్రీ రాజరాజేశ్వరీ సమేత శ్రీ ఉమా కుక్కుటేశ్వరస్వామి వారి దివ్య కల్యాణోత్సవం గురువారం రాత్రి 8.32 గంటలకు నిర్వహిస్తారు. 18వ తేదీ మహాశివరాత్రి, 19న రథోత్సవం, 21న తెప్పోత్సవం, శ్రీపుష్పోత్సవం నిర్వహిస్తారు. మహాశివరాత్రి ఉత్సవాలను కన్నుల పండువగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఈఓ వి.శ్రీనివాస్ తెలిపారు. ఉత్సవాల సందర్భంగా పాదగయ క్షేత్రాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దుతున్నారు. పాదగయ క్షేత్రంతో పాటు సకలేశ్వర స్వామి, సోమేశ్వరస్వామి ఆలయాలు, గొల్లప్రోలు మండలం దుర్గాడలోని ఉమా రామలింగేశ్వరస్వామి, చేబ్రోలు పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి, తాటిపర్తి అపర్ణా సమేత నాగేశ్వరస్వామి ఆలయాల్లో కూడా శివరాత్రి ఉత్సవాలకు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

‘మండలి’ సందడి

- వచ్చే నెల 13న స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నిక
- ఇప్పటికే షెడ్యూల్ విడుదల
- ఉమ్మడి జిల్లాలో హడావుడి
- అమలులోకి ఎన్నికల కోడ్

సాక్షి, రాజమహేంద్రవరం: స్థానిక సంస్థల కోటాలో రాష్ట్ర శాసన మండలి ఎన్నికలకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సందడి మొదలైంది. ఈ నెల 16న నోటిఫికేషన్ విడుదలతో ప్రారంభం కానున్న ఈ ప్రక్రియ మార్చి 16వ తేదీన ఓట్ల లెక్కింపుతో ముగియనుంది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవల షెడ్యూల్ ప్రకటించింది. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చింది. ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యే వరకు ఇది అమలులో ఉంటుంది. దీని ప్రకారం ప్రభుత్వ పథకాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయరాదు. ప్రస్తుతం కొనసాగుతున్న పథకాలను యథాతథంగా అమలు చేయవచ్చు. ఇతర ఆస్తులపై ప్రచార హోర్డింగులు ఉండకూడదు.

చిక్కాల పదవీ కాలం ముగియడంతో..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ స్థానాలు రెండు ఉన్నాయి. వీటి నుంచి మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, అనంత ఉదయ భాస్కర్ సభ్యులుగా ఉన్నారు. టీడీపీ అధికారంలో ఉండగా మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీగా 2017లో ఎన్నికయ్యారు. ఆయన పదవీ కాలం మే 1తో ముగియనుంది. ఈ స్థానం భర్తీకి ఈ ఎన్నిక నిర్వహిస్తున్నారు.



1,164 మంది ఓటర్లు

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా జెడ్పీటీసీ సభ్యులు 59 మంది, ఎంపీటీసీ సభ్యులు 1,083 మంది ఉన్నారు. వీరితో పాటు 19 మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలు స్థానిక సంస్థల్లో ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉన్నారు. అందరూ కలిపి మొత్తం 1,164 మంది ఓటర్లు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో ఓటు వేయనున్నారు.

వార్ వన్‌సైడే..

గతంలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తిరుగు లేని ఆధిక్యం సాధించింది. సుమారు 90 శాతం జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో విజయఢంకా మోగించి, తిరుగులేని శక్తిగా అవతరించింది. మొత్తం 62 జెడ్పీటీసీ స్థానాలుండగా.. రాజమహేంద్రవరం రూరల్‌కు ఎన్నిక జరగలేదు. మిగిలిన 61లో ఇద్దరు (కడియం, కోటనందూరు) రాజీనామా చేయగా.. మిగిలిన 59 స్థానాల్లో ఒక్కటి మాత్రమే టీడీపీ గెలుచుకుంది. మిగిలిన స్థానాలు వైఎస్సార్ సీపీ ఖాతాలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నిక వైఎస్సార్ సీపీకి లాంఛనమే కానుంది. అధిష్టానం అభ్యర్థి ప్రకటించడమే తరువాయి.. వార్ వన్‌సైడ్ కానుంది.

ఎన్నికల షెడ్యూల్

స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ స్థానానికి ఈ నెల 16న కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా నోటిఫికేషన్ వెలువరించనున్నారు. నామినేషన్ల స్వీకరణ కాకినాడ కలెక్టరేట్‌లో జరగనుంది. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ జరుగుతుంది. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ వ్యవహరిస్తారు. మొత్తం ఎన్నికల ప్రక్రియ ఆమె ఆధ్వర్యంలోనే నడుస్తుంది.

- నామినేషన్ల స్వీకరణ : ఈ నెల 16 నుంచి 23 వరకూ
- నామినేషన్ల పరిశీలన : 24.02.2023
- ఉపసంహరణకు గడువు : 27.02.2023
- పోలింగ్ : మార్చి 13
- ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి : మార్చి 16

సత్యదేవుని సన్నిధిలో రూ.లక్ష విరాళం



అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి మనోహర్, హేమ (జగ్గయ్యపేట) ఆదివారం రూ.లక్ష విరాళం సమర్పించారు. వారికి ఏఈఓ కృష్ణారావు అన్నదానం బాండ్ అందజేశారు.

లోవకు భక్తుల తాకిడి

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారిని దర్శించేందుకు వచ్చిన భక్తులతో లోవ దేవస్థానంలో రద్దీ నెలకొంది. వివిధ జిల్లాల నుంచి ఆదివారం 12 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్టు కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. ప్రసాదాలు, పూజా టికెట్ల విక్రయం, కాటేజీల అద్దెలు, విరాళాల రూపంలో రూ.3,76,954 ఆదాయం సమకూరిందని వివరించారు.

కలెక్టరేట్‌లో నేడు స్పందన

కాకినాడ సిటీ: ప్రజా విజ్ఞాపనల స్వీకరణ కార్యక్రమం – స్పందనను సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నారు. ఉదయం 9.30 నుంచి ఈ కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ కృతికా శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

15 నుంచి చంద్రబాబు పర్యటన

గోకవరం: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 15, 16, 17 తేదీల్లో జగ్గంపేట, పెద్దాపురం, అనపర్తి నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. ఈ నెల 15న రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టు నుంచి గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డి గ్రామానికి చేరుకుంటారు. సాయంత్రం 4 గంటలకు గుమ్మళ్లదొడ్డిలో పర్యటన ప్రారంభించి, అదే రోజు జగ్గంపేటలో బహిరంగ సభ నిర్వహిస్తారు. 16న పెద్దాపురం, 17న అనపర్తి నియోజకవర్గాల్లో పర్యటన ముగించుకుని రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి తిరుగుప్రయాణమవుతారు.



బషీర్‌బీబీ ఆలయ ప్రాంగణంలో భక్తుల కోలాహలం



భక్తులతో కిక్కిరిసిపోయిన పొన్నాడ పరిసరాలు

భక్తజన సాగరం

- పొన్నాడకు పోటెత్తిన భక్తులు
- బషీర్‌బీబీ దర్శనానికి క్యూ
- ప్రత్యేక ప్రార్థనలు.. ఘనంగా గంధోత్సవం

కొత్తపల్లి: మత సామరస్యానికి చిహ్నంగా నిలుస్తున్న బంగారు పాపమ్మ (బషీర్‌బీబీ ఔలియా) 68వ ఉర్స్ ఉత్సవాల సందర్భంగా చివరి రోజైన ఆదివారం పొన్నాడ భక్తజన సంద్రమే అయ్యింది. రాష్ట్రం నలుమూలల నుంచీ భక్తులు తరలివచ్చారు. గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల్లో ఎక్కడ చూసినా భక్తజన సందోహమే కనిపించింది. మూలపేట నుంచి పొన్నాడ వరకూ కాలినడకన వెళ్లేందుకు కూడా వీలు లేని పరిస్థితులు నెలకొన్నాయి. భక్తులు వచ్చిన వాహనాలతో పలుమార్లు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పిఠాపురం, తుని, కాకినాడ నుంచి వాహనాల్లో వచ్చిన వారు పొన్నాడ చేరుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం నుంచీ భక్తుల రాక అంతకంతకూ పెరుగుతూ వచ్చింది. సుమారు 50 వేల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ ముజావర్లు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా గంధోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. పెదబొడ్డేపల్లికి చెందిన ఎండీ తాజుద్దీన్ బాబా గంధం (సంథల్) సమర్పించారు. దీనిని ప్రత్యేకంగా అలంకరించిన గుర్రంపై ఉంచి ఫకీర్ మేళాతో మూలపేటకు చెందిన షేక్‌మౌలా సాహెబ్ ఇంటి నుంచి ఆలయం వరకూ ఊరేగించారు. దారి పొడవునా బషీర్‌బీబీ గంధానికి భక్తులు పూజలు నిర్వహించారు. గంధోత్సవం అమ్మవారి ఆలయానికి చేరుకున్న వెంటనే పాతేహఖానీ నిర్వహించిన అనంతరం అమ్మవారికి గంధం పూశారు. సంప్రదాయ ప్రార్థనల అనంతరం భక్తులకు గంధం పంపిణీ చేశారు. గంధోత్సవంలో వేలాదిగా ముస్లింలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతో ఆకట్టుకున్నాయి. పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఆధ్వర్యాన కొత్తపల్లి ఎస్సై రామలింగేశ్వరరావు సారథ్యంలో సుమారు 100 సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. వాహనాలను పొన్నాడ, అమరవిల్లి, నాగులపల్లి వద్దనే నిలిపివేశారు. గ్రామ కార్యదర్శి ఆధ్వర్యాన భక్తులకు తాగునీరు, పారిశుధ్యం, ఇతర సౌకర్యాలు కల్పించారు. బషీర్‌బీబీ అమ్మవారిని జిల్లా ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ముజావర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయన వెంట అడిషనల్ ఎస్పీ పి.శ్రీనివాస్, కాకినాడ ఎస్డీపీఓ పి.మురళీ కృష్ణారెడ్డి, సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, ఎస్సై రామలింగేశ్వరరావు ఉన్నారు.



బషీర్‌బీబీ సన్నిధిలో ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు, అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్



ఆకట్టుకున్న ఫకీర్ మేళా



బషీర్‌బీబీకి గంధాన్ని తీసుకెళుతున్న భక్తులు

ఫిబ్రవరిలోనే చుర్రు

- ఉమ్మడి జిల్లాలో 34 నుంచి 37 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రతలు
- ఉదయం వణికించే చలి.. మధ్యాహ్నం మండుతున్న ఎండ
- పగలు – రాత్రి మధ్య 13 నుంచి 16 డిగ్రీల వ్యత్యాసం
- పెరుగుతున్న వైరల్ జ్వరాలు
- వరి, ఉద్యాన పంటలకు నష్టం

సాక్షి అమలాపురం: తెల్లవారుజామున దట్టంగా కమ్ముకుంటున్న మంచు, వణికిస్తున్న చలి. మధ్యాహ్నం చురుక్కుమనిపిస్తున్న ఎండలు, ఉక్కపోత. ఒకే రోజు భిన్నమైన వాతావరణంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పలువురు జ్వరాల బారిన పడుతున్నారు. తూర్పు గోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం భిన్న వాతావరణంతో సామాన్యులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సాధారణంగా ఉదయం, మధ్యాహ్న సమయంలో 10 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత తేడా ఉండటం సర్వసాధారణం. రెండు రోజులుగా కనిష్ట, గరిష్ట ఉష్ణోగ్రతల మధ్య ఏకంగా 13 నుంచి 16 డిగ్రీల వ్యత్యాసం ఉంటోంది. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో 37 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదు కాగా, రాజమహేంద్రవరంలో 36; కాకినాడ జిల్లా గోకవరం 37, తుని 35, కాకినాడ 33; కోనసీమ జిల్లా మండపేటలో 36, అమలాపురం 33 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇదే సమయంలో రాత్రి ఉష్ణోగ్రతలు ఇంచుమించు అన్ని ప్రాంతాల్లోనూ 21 నుంచి 22 డిగ్రీలుగా నమోదయ్యాయి.



రాజమహేంద్రవరంలో చురుక్కుమనిపిస్తున్న ఎండ

పెరుగుతున్న వైరల్ జ్వరాలు

వాతావరణ మార్పుల వల్ల పలువురు విషజ్వరాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా చిన్నారుల్లో జ్వరాల తీవ్రత అధికంగా ఉంది. జ్వరాలతో పాటు గొంతు సంబంధిత వ్యాధులు కూడా పెరిగాయి. రోజుల తరబడి పలువురు గొంతు ఇన్ఫెక్షన్లతో ఇబ్బంది పడుతున్నారని వైద్యులు చెబుతున్నారు.

వరిలో నీటి ఆవిరి ఇక్కట్లు

అధికారులు యాజమాన్య పద్ధతులు పాటించి గోదావరి డెల్టాకు నీరందిస్తున్నారు. పగటి పూట పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల ఎవాపరేషన్ లాసెస్ (ఆవిరి రూపంలో నీటి నష్టం) పెరుగుతోంది. గోదావరి డెల్టాలో మార్చి నుంచి ఈ పరిస్థితి ఉంటుంది. కానీ ఈ ఏడాది ఫిబ్రవరి రెండో వారం నుంచే ఆవిరి రూపంలో చాలా వరకూ నీరు పోతోందని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. ఫిబ్రవరిలోనే ఎండలు ఈ స్థాయిలో ఉంటే మార్చి, ఏప్రిల్‌లో పరిస్థితి ఏమిటని వారు ఆందోళన చెందుతున్నారు.

తెల్లదోమ ముప్పు

రాత్రి చలి, ఉదయం ఎండ వాతావరణం రూగోస్ వైట్ ఫ్లై (తెల్లదోమ) ఉధృతికి అనుకూలమైన కాలం. ఈ పరిస్థితుల్లో తెల్లదోమ తన సంతతిని రెట్టింపు చేస్తుంది. దీనివల్ల ఇప్పటికే కొబ్బరిలో 30 శాతం దిగుబడి తగ్గింది. ఆయిల్ పామ్‌లోనూ ఇదే పరిస్థితి. ఉధృతి పెరిగి ఇది అరటి, ఇతర ఉద్యాన పంటల మీద కూడా పడుతోంది.

వైరల్ ఫీవర్ల సీజన్



వాతావరణం వల్ల వైరల్ ఫీవర్ల సీజన్ కొనసాగుతోంది. ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. సాధ్యమైనంత వరకూ శీతల పానీయాలకు దూరంగా ఉండాలి. పండ్లు, ఫ్లూయిడ్స్ అధికంగా తీసుకోవాలి. పరిశుభ్రమైన ఆహారంతో పాటు మంచులో తిరగడం తగ్గించాలి.

– డాక్టర్ కె.శంకరరావు, మెడికల్ సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి, అమలాపురం

తెల్లదోమకు అనుకూలం



ఉదయం చల్లని, మధ్యాహ్నం ఎండ వాతావరణం తెల్లదోమ ఉధృతికి అనుకూలం. ఈ సమయంలో తెల్లదోమలు అధికంగా గుడ్లు పెడతాయి. ఎక్కువ శాతం లార్వాగా మారతాయి. అదే వేసవిలో అయితే గుడ్లు పెట్టడం తక్కువ. వాటిలో లార్వా అయ్యేది మరీ తక్కువ.

– ఎం.దిలీప్‌కుమార్, ఉద్యాన శాఖ అధికారి, అమలాపురం

నీటి వినియోగం పెరుగుతోంది



ఫిబ్రవరిలోనే ఎండల తీవ్రత పెరగడం వల్ల రబీ సాగుకు నీటి వినియోగం పెరుగుతోంది. ఇప్పటికే శివారుకు నీటి సరఫరాలో అవాంతరాలు ఏర్పడుతున్నాయి. ఎండల తీవ్రత ఇదేవిధంగా పెరిగితే మార్చి, ఏప్రిల్ నెలల్లో కాలువలకు మరింత నీటిని విడుదల చేయాల్సి వస్తుంది.

– సత్తి శ్రీనివాసరావు, మాజీ వైస్ చైర్మన్, గోదావరి ప్రాజెక్టు కమిటీ, సమనస, అమలాపురం మండలం

కష్టపడితే అనుకున్నది సాధ్యం

- విశాఖ కలెక్టర్ మల్లికార్జున
- రాష్ట్రస్థాయి పోటీలకు ఎంవీజీఆర్, ఎస్జీపీ జట్ల అర్హత
- ముగిసిన 'సాక్షి' ప్రీమియర్ లీగ్ ప్రాంతీయ పోటీలు


మాట్లాడుతున్న విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున


జూనియర్స్ విజేత సాయిగణపతి పాలిటెక్నిక్


జూనియర్స్ రన్నరప్ శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాల


కలెక్టర్ నుంచి ట్రోఫీ స్వీకరిస్తున్న సీనియర్స్ విజేత ఎంవీజీఆర్ కళాశాల


సీనియర్స్ రన్నరప్ ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల

విశాఖ స్పోర్ట్స్: బాధ్యతగా కష్టపడితే అనుకున్నది సాధించవచ్చని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. 'సాక్షి' ప్రీమియర్ లీగ్ ప్రాంతీయ పోటీల ముగింపు కార్యక్రమానికి విచ్చేసిన ఆయన క్రీడాకారులనుద్దేశించి మాట్లాడారు. పని మీద చిత్తశుద్ధితో దృష్టి సారిస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. క్రికెటర్ భరత్ జిల్లా స్థాయి నుంచి నేడు భారత జట్టుకు ఆడే స్థాయికి ఎదిగాడని ఉదహరించారు. కాగా.. 'సాక్షి' ప్రీమియర్ లీగ్ (ఎస్పీఎల్) క్రికెట్ రాష్ట్రస్థాయి పోటీలకు సీనియర్స్ విభాగం నుంచి ఎంవీజీఆర్ కళాశాల(విజయనగరం)జట్టు, జూనియర్స్ విభాగం నుంచి సాయిగణపతి పాలిటెక్నిక్ జట్టు అర్హత సాధించాయి. ఏయూ గోల్డెన్ జూబ్లీ మైదానంలో ఆదివారం జరిగిన ప్రాంతీయ స్థాయి పోటీల ఫైనల్‌లో ప్రభుత్వ మెన్ ఆర్ట్స్ కళాశాల (శ్రీకాకుళం) జట్టుపై తొమ్మిది వికెట్ల తేడాతో ఎంవీజీఆర్ కళాశాల(విజయనగరం) జట్టు, సాయిగణపతి పాలిటెక్నిక్(గిడిజాల) జట్టు 16 పరుగుల తేడాతో శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాల(పెద్దాపురం) జట్టుపై విజయం సాధించాయి. 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ పోటీల్లో శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి, విశాఖ ఉమ్మడి జిల్లాల విజేతలుగా నిలిచిన సీనియర్స్, జూనియర్స్ జట్లు పోటీపడ్డాయి. ముగింపు కార్యక్రమంలో 'సాక్షి' బ్యూరో చీఫ్ కె.జి.రాఘవేంద్రరెడ్డి, యాడ్స్ డీజీఎం శ్రీనివాసరావు, బ్రాంచ్ మేనేజర్ చంద్రరావు, 'సాక్షి' టీవీ సీనియర్ కరస్పాండెంట్ రామచంద్రరావు పాల్గొన్నారు. ప్రాంతీయ పోటీల్లో విజేతలకు కలెక్టర్ ట్రోఫీలు, సర్టిఫికెట్లు బహూకరించారు.

బౌలర్లు బెంబేలెత్తించారు

సీనియర్స్ విభాగంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో టాస్ ఓడిన ప్రభుత్వ మెన్ ఆర్ట్స్ కళాశాల(శ్రీకాకుళం) జట్టు తొలుత బ్యాటింగ్ చేసింది. నిర్ణీత 10 ఓవర్లకు మరో రెండు బంతులుండగానే 59 పరుగులకు ఆలౌటైంది. జయంత్ మూడు, కల్యాణ్ రెండు, సురేష్ ఒక వికెట్ తీసి బ్యాటర్లను బెంబేలెత్తించారు. ప్రతిగా ఎంవీజీఆర్ కళాశాల జట్టు(విజయనగరం) ఒకే వికెట్ కోల్పోయి 7.1 ఓవర్లలోనే విజయలక్ష్యాన్నందుకుంది. కిరీటి 24 పరుగులు చేశాడు. యశ్వంత్ ఒక వికెట్ తీయగలిగాడు.

కష్టపడ్డారు

జూనియర్స్ విభాగంలో టాస్ గెలిచిన శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాల జట్టు లక్ష్య ఛేదనకే మొగ్గు చూపింది. దీంతో తొలుత బ్యాటింగ్ చేసిన సాయి గణపతి పాలిటెక్నిక్ జట్టు 10 ఓవర్లకు ఎనిమిది వికెట్లు కోల్పోయి 84 పరుగులు చేసింది. నూకేష్ 29, కుమార్ 22 పరుగులు చేశారు. యశస్వి, చారి రెండేసి వికెట్లు తీశారు. ప్రతిగా శ్రీ ప్రకాష్ జట్టు మూడే వికెట్లు కోల్పోయినా.. 68 పరుగులే చేసింది. చరణ్ సాయి 35 పరుగులతో రాణించాడు.

క్లుప్తంగా

ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి


పంటకాలువ వైపు బోల్తా పడిన ఇటుకల లోడు ట్రాక్టర్

కె.గంగవరం: మండల పరిధిలోని కూళ్ల–కోటిపల్లి మధ్యలో గల ఏటిగట్టుపై ఇటుకల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ తిరగబడి కూలీ నీలా నాగేశ్వరావు(52) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నీలా నాగేశ్వరరావు ఆదివారం తెల్లవారు జామున కూళ్ల నుంచి ఇటుకల లోడు వేసుకుని డ్రైవర్‌తో పాటు యానాం వెళ్తున్నాడు. కోటిపల్లి వద్దకు వచ్చే సరికి ఎదురుగా వస్తున్న ఆవును తప్పించబోగా అదుపు తప్పి ట్రాక్టర్ తిరగబడింది. డ్రైవర్ పక్కన కూర్చున్న నీల నాగేశ్వరరావు ఈ ప్రమాదంలో మృతి చెందాడు. మృతదేహాన్ని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చిరంజీవి తెలిపారు.

చికిత్స పొందుతూ..

సీతానగరం: మండలంలోని మునికూడలికి చెందిన గెడ్డం ఏసు (35) రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందాడని హెడ్ కానిస్టేబుల్ టి.లోవకుమార్ ఆదివారం తెలిపారు. మద్యం తాగడానికి తన భార్య డబ్బులు ఇవ్వలేదని కోపంతో మృతుడు ఏసు శనివారం పొలంలో దొరికిన పురుగు మందు తాగాడు. ఇంటికి వచ్చి వాంతులు చేసుకోవడంతో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మరణించాడు. ఆసుపత్రి సమాచారంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు ఢీకొని..


ఘటనా స్థలిలో సత్యనారాయణ మృతదేహం

రామచంద్రపురం: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ అవుట్‌గేట్ వద్ద ఆర్టీసీ బస్సును మోటారు సైకిల్‌పై వస్తున్న వ్యక్తి ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. రామచంద్రపురం ఎస్సై డి.సురేష్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని శీలం వారిసావరానికి చెందిన టేకుమూడి సత్యనారాయణ(53) కాకినాడ రోడ్డులోని చోడవరం వైపునకు మోటారు సైకిల్‌పై వెళుతుండగా అవుట్ గేట్‌లో నుంచి బయటకు వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్‌కుమార్ తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం


రేషన్ బియ్యంతో పాటు వాహనాన్ని పట్టుకున్న అధికారులు

కె.గంగవరం: మండల పరిధిలోని సత్యవాడలో ఆదివారం బిల్లులు లేకుండా తరలిస్తున్న రేషన్ బియ్యంతో పాటు వాహనాన్ని విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులు సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ రమేష్, తహసీల్దార్ విజయకుమార్ తెలిపిన వివరాల ప్రకారం సత్యవాడ గ్రామానికి చెందిన సలాది సత్యనారాయణ కపిలేశ్వరపురం మండలంలోని టేకి, అంగర పరిసర గ్రామాల్లో రేషన్ కార్డుదారుల వద్ద నుంచి కిలో రూ.18 చొప్పున బియ్యం కొనుగోలు చేసి కిలో రూ.20 చొప్పున యానం పరిసర ప్రాంతాల్లోని చేపల చెరువులకు అమ్ముకుంటున్నాడు. ఆదివారం వాహనంలో రూ.6,80,000 విలువ చేసే 20 క్వింటాళ్ల బియ్యాన్ని యానాం తరలిస్తుండగా పట్టుకుని సీజ్ చేసి సెక్షన్ 6ఏ కింద కేసు నమోదు చేశారు. వాహనం నడుపుతున్న చావకుల వెంకటేశ్వరరావు, సలాది సత్యనారాయణలపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కె.గంగవరం పోలీసులకు సిఫార్స్ చేశారు. హెడ్‌కానిస్టేబుల్ జీవానందం, కానిస్టేబుల్ ఈశ్వర్ ఈ తనిఖీలో పాల్గొన్నారు.

ముగిసిన జిమ్నాస్టిక్స్ పోటీలు


పతకాలు సాధించిన కాకినాడ క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా క్రీడామైదానంలోని జిమ్నాజియంలో రెండ్రోజులు జరిగిన అండర్–17, 19 బాలుర, బాలికల జిమ్నాస్టిక్స్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ముగింపు ఉత్సవానికి పిఠాపురం ఉపవిద్యాశాఖ అధికారిణి సుభద్ర ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆమె మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడానైపుణ్యాలు వెలికి తీయడానికి ఈ పోటీలు ఒక చక్కని వేదిక అన్నారు. పాఠశాల క్రీడాసమాఖ్య జిల్లా కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ ఈ పోటీలకు వివిధ జిల్లా నుంచి 280 క్రీడాకారులు, 15 మంది క్వాలిఫైడ్ కోచ్‌లు హాజరయ్యారన్నారు. విజేతలకు ముఖ్యఅతిథి సుభద్ర బహుమతులు అందజేశారు. ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో గుంటూరు మొదటి, వైఎస్సార్ కడప ద్వితీయ, విశాఖ తృతీయస్థానాలు సాధించాయి. అండర్–19 బాలుర విభాగంలో చంద్రస్వరూప్ కాకినాడ, హర్షవర్ధన్ గుంటూరు, బాలికల విభాగంలో విజయవాడకు చెందిన ఐశ్వర్య, ప్రజ్ఞలు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. డీఎస్ఏ జిమ్నాస్టిక్స్ కోచ్ సురేష్ పోటీలను పర్యవేక్షించారు. పరిశీలకులుగా పశ్చిమగోదావరికి చెందిన చంద్రశేఖర్, ప్రసాద్ వ్యవహరించారు. డీఎస్ఏ చీఫ్ కోచ్ శ్రీనివాస్‌కుమార్, ఎస్‌జీఎఫ్ఐ అండర్–19 కార్యదర్శి తాతబ్బాయి, పీడీలు రంగారావు, రవిరాజు, బంగార్రాజు, వెంకటేశ్వర్లు, హరిబాబు, మాచరరావు, శ్రీనివాస్, రాజు, డీఎస్ఏ అథ్లెటిక్స్ కోచ్ ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

క్వాలిఫైడ్ అభ్యర్థులకు లైన్ క్లియర్

- డీఎస్సీ 1998 అభ్యర్థులతో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ
- గతంలోనే సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి
- ఉమ్మడి జిల్లాలో 486 మందికి అవకాశం


1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు (ఫైల్)

రాయవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చేందుకు లైన్ క్లియర్ అయ్యింది. సుమారు 24 ఏళ్ల అనంతరం వారి కల ఫలించనుంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వీరితో భర్తీ చేయనున్నారు. ఈ మేరకు రాష్ట్ర కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారు. ఉపాధ్యాయ వృత్తిలో చేరేందుకు క్వాలిఫైడ్ అభ్యర్థులు ఇప్పటికే తమ ఆసక్తి కనబరుస్తూ ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. వారి సర్టిఫికెట్ల పరిశీలనను గతేడాది అక్టోబర్‌లోనే విద్యాశాఖ అధికారులు పూర్తి చేశారు. వీరికి ఎంటీఎస్ (మినిమం టైమ్ స్కేల్) కింద నెలకు రూ.39 వేలు చెల్లించే పద్ధతిలో నియామకాలు చేపట్టనున్నారు.

క్వాలిఫైడ్ అభ్యర్థులు ఎలా అంటే..

1998 డీఎస్సీ సమయంలో 1:3 నిష్పత్తిలో అభ్యర్థులను ఇంటర్వ్యూకు పిలిచారు. ఇంటర్వ్యూలో అర్హత సాధించినప్పటికీ పోస్టు రాని వారిని క్వాలిఫైడ్ అభ్యర్థులుగా పేర్కొన్నారు. అంతకుముందు జరిగిన డీఎస్సీల్లో మిగిలిన వారికి రోస్టర్, సీనియారిటీ ప్రకారం ఖాళీ అయిన పోస్టులు కేటాయించినందున, ఆ విధంగానే భవిష్యత్తులో వచ్చే ఖాళీలను తమతో భర్తీ చేయాలని 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు అప్పటి ప్రభుత్వాన్ని కోరారు. సానుకూల స్పందన రాకపోవడంతో పలువురు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. టీడీపీ ప్రభుత్వం వీరిని పట్టించుకోకపోవడంతో తాము అధికారంలోకి రాగానే 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు న్యాయం చేస్తానని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు వారికి న్యాయం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

చేరేందుకు అంగీకరించి..

గతేడాది సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకూ అర్హులు వారి అంగీకారాన్ని తెలుపుతూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న వారి సర్టిఫికెట్లను కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో గతేడాది అక్టోబర్ 6వ తేదీ నుంచి 14వ తేదీ లోపు పరిశీలన జరిపి సీనియారిటీ జాబితాను రూపొందించారు. 1998 డీఎస్సీలో అధికంగా 55 ఏళ్లు పైబడిన వారే. ఇందులో అధికంగా పలు ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. పలువురు ఇతర వృత్తుల్లో స్థిరపడ్డారు. ఉపాధ్యాయ వృత్తిలో చేరేందుకు ఉమ్మడి జిల్లా నుంచి 556 మంది దరఖాస్తు చేసుకున్నారు. 556 మందిలో 70 మంది సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు గైర్హాజరయ్యారు. మిగిలిన 486 మంది ఉపాధ్యాయ వృత్తిలో చేరేందుకు అంగీకరించారు.

కొత్తగా ఏర్పడే ఖాళీల్లో..

ప్రభుత్వం ఇప్పటికే పదోన్నతుల ప్రక్రియ చేపట్టింది. ఈ ప్రక్రియలో భాగంగా ఎస్‌జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్లకు, స్కూల్ అసిస్టెంట్ల నుంచి హెచ్ఎంలకు, హెచ్ఎంల నుంచి ఎంఈవోలకు పదోన్నతులు తాత్కాలిక ప్రాతిపదికన చేపట్టారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీగా సర్దుబాట్లు చేపట్టారు. పదోన్నతులు, సర్దుబాట్లు ప్రక్రియ పూర్తయిన అనంతరం ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఏర్పడిన ఖాళీల్లో 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులను నియమించే అవకాశముంది. ఇదిలా ఉంటే ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఈ నేపథ్యంలో నియామక ప్రక్రియకు ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం మాకు న్యాయం చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి జీవితాంతం రుణపడి ఉంటాం. ఇప్పటికైనా ప్రభుత్వ ఉద్యోగంలో చేరబోతున్నందుకు సంతోషంగా ఉంది. జాయినింగ్ ఆర్డర్స్ త్వరితగతిన ఇచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కోటిపల్లి రాంబాబు, జిల్లా అధ్యక్షుడు, 1998 క్వాలిఫైడ్ టీచర్స్ అసోసియేషన్, మండపేట

మార్గదర్శకాలకు అనుగుణంగా..

ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నియామకాలు చేపడతాం. దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసి, సీనియారిటీ జాబితాను సిద్ధం చేశాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే కౌన్సెలింగ్ నిర్వహించి నియామకాలు చేపడతాం.

– ఎస్.అబ్రహం, డీఈవో, తూర్పుగోదావరి

బావిలో దూకిన వ్యక్తి మృతదేహం లభ్యం



జాన్ మృతదేహం


సీతానగరం: మండంలోని మిర్తిపాడులో ఈ నెల 10న బావిలో దూకిన గుర్తు తెలియని వ్యక్తి మృదేహం ఆదివారం లభ్యమైంది. మృతిచెందిన యువకుడు రాజమహేంద్రవరం రూరల్ తొర్రేడుకు చెందిన పల్లి జాన్ (22)గా గుర్తించారు. ఈ నెల 10న రాత్రి పాడుబడిన మద్దిపాటి వీరన్నచౌదరి బావిలో అతను దూకాడు. వీఆర్వో నామాల రత్నకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 11న కేసు నమోదు చేశారు. ఆదివారం లభించిన మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శుభశేఖర్ తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

తుని: తొండంగి మండలం రావికంపాడు–గొల్లప్రోలు మధ్యలో రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని తుని జీఆర్పీ ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ తెలిపారు. ఆదివారం జరిగిన ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రైలులో ప్రయాణిస్తూ, లేదా పట్టాలు దాటుతుండగా విశాఖ నుంచి వెళుతున్న రైలు ఢీకొనడంతో మృతి చెందాడు. మృతుడికి 35 ఏళ్ల వయసు ఉండవచ్చన్నారు. మృతదేహంపై తెలుపురంగుపై చిన్న చిన్న నలుపుచుక్కల ఫుల్ చేతుల చొక్కా, సిమెంట్ రంగు ఫుల్ ఫ్యాంటు ఉన్నాయి. కేసు నమోదు చేసి మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


ఈతకు వెళ్లి మృత్యువాత


రాజా మృతదేహం


కొండపల్లి రాజా (ఫైల్)

కిర్లంపూడి: స్నేహితులతో ఈతకు అని వెళ్లి తిరిగిరాని లోకాలకు చేరిన ఘటన కిర్లంపూడి మండలం వీరవరం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కొండపల్లి రాజా(19) రాజమహేంద్రవరం జిల్లా రాజానగరంలో ఆదికవి నన్నయ్య యూనివర్సిటీలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. రెండు రోజులు సెలవులు కావడంతో శనివారం తన నివాసానికి వచ్చాడు. ఆదివారం సాయంత్రం 4గంటల సమయంలో తన స్నేహితులతో కలిసి ఏలేరు కాలువ ముక్కోల్లు వాగుల ఒడ్డు వద్ద ఈతకు వెళ్లాడు. నీటిలో దిగిన రాజా బయటకు రాకపోవడంతో స్నేహితులు స్థానికులకు సమాచారం ఇచ్చారు. దీనితో కాలువలో వెతకగా ఊబిలోకి కూరుకుపోయి మరణించినట్లు గుర్తించారు. మృతదేహాన్ని వీరవరంలోని ఇంటికి తరలించారు. మృతుడు తండ్రి కొండపల్లి సోమరాజు దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు వ్యవసాయ పనుల్లో సహాయపడుతుంటాడు. చిన్నకుమారుడు రాజాని చదివించి ఉన్నత స్థానంలో చూడాలన్న తమ ఆశలు అడియాశలు అయ్యాయని తల్లిదండ్రుల తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై టి.రఘునాథరావు తెలిపారు.

తల్లిదండ్రులను చూడడానికి వచ్చి అనంతలోకాలకు..


మృతుడు వీరబాబు

శంఖవరం: తల్లిదండ్రులను చూడడానికి వచ్చిన కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఘటన ఆదివారం శంఖవరంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కొండేపూడి వీరబాబు (42) యు.కొత్తపల్లి మండలం కొమరిగిరిలో చిరు వ్యాపారం (టిఫిన్ సెంటర్) నిర్వహిస్తూ నివాసం ఉంటున్నాడు. అక్కడి నుంచి తల్లిదండ్రులను చూసేందుకు శుక్రవారం శంఖవరం వచ్చాడు. తల్లిదండ్రులతో కష్టసుఖాలు పంచుకుని తిరిగి ఆదివారం ద్విచక్రం వాహనంపై కొమ్మరిగిరి బయలుదేరాడు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద మలుపు తిరుగుతుండగా కత్తిపూడి నుంచి వస్తున్న వ్యాన్ బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంతో వీరబాబు తీవ్రగాయాలు అయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య,ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నాడు. మృతదేహాన్ని ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అన్నవరం పోలీసులు తెలిపారు.

తైక్వాండోతో ఆత్మరక్షణ

- శాప్ అధికారిణి రమణ
- రాష్ట్ర స్థాయి పోటీలు ప్రారంభం


ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న శాప్ ప్రత్యేక అధికారిణి రమణ తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆత్మరక్షణకు తైక్వాండో వంటి మార్షల్ ఆర్ట్స్ ప్రతీ ఒక్కరికి అవసరమని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక అధికారిణి ఎస్‌వీ రమణ పేర్కొన్నారు. ఆదివారం కాకినాడ జిల్లా క్రీడామైదానంలోని ఇండోర్ హాల్‌లో జిల్లా తైక్వాండో సంఘం ఆధ్వర్యంలో 38వ సీనియర్స్ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు ప్రారంభమయ్యాయి. శాప్ అధికారిణి ఎస్‌వీ రమణ ముఖ్యఅతిథిగా విచ్చేసి పోటీలను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ నిజజీవితంలో రాణించడానికి క్రీడలు దోహదపడతాయన్నారు. తైక్వాండో సంఘ రాష్ట్ర కార్యదర్శి పి.అచ్చుతరెడ్డి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. జిల్లా ఒలింపిక్ సంఘ కార్యదర్శి కె.పద్మనాభం మాట్లాడుతూ ఏటా వేసవిలో వందల సంఖ్యలో క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారన్నారు. డీఎస్ఏ చీఫ్ కోచ్ శ్రీనివాస్‌కుమార్ పోటీలను ప్రారంభించారు. 8 విభాగాల్లో పోటీలు జరిగాయి. విజేతలు చెన్నయ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటారు. కాకినాడ పోర్టు ఆఫీసర్ ధర్మశాస్త, తైక్వాండో సంఘ కార్యదర్శి బి.అర్జునరావు, కోచ్‌లు చిరంజీవి, సత్యన్నారాయణ, వివిధ జిల్లాల కోచ్‌లు, మేనేజర్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అసభ్య వీడియోలు వైరల్ చేసిన వారిపై కేసు


పరారైన పవన్‌కుమార్ (ఫైల్)

మలికిపురం: ఓ మహిళ నగ్నంగా ఉన్న వీడియోలు వైరల్ చేశారని మండలంలోని గూడపల్లి గ్రామానికి చెందిన భాగవతుల లక్ష్మీనారాయణ పవన్‌కుమార్‌తో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై హరికోటి శాస్త్రి ఆదివారం తెలిపారు. గూడపల్లి అంగన్‌వాడీ టీచర్ సిద్ధిరెడ్డి కనకదుర్గ చేసిన ఫిర్యాదుపై విచారణ చేసి కేసు నమోదు చేశామని చెప్పారు. గత ఏడాది జూలై నెలలో ఇదే యువకుడిపై కనకదుర్గ కుటుంబం హత్యాయత్నానికి పాల్పడినట్లు కూడా కేసు నమోదయిందని ఆయన చెప్పారు. వివాహిత అయిన కనకదుర్గకు పవన్‌కుమార్‌కు గతం నుంచీ పరిచయాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పవన్‌కుమార్ విదేశాలకు వెళ్లి సంపాదించిన డబ్బు సుమారు రూ.12 లక్షలు కనకదుర్గకు పంపాడు. అయితే వారి సంబంధాలు బెడిసి కొట్టడంతో ఆ డబ్బు తిరిగి ఇవ్వాలని పవన్ పంచాయితీ పెట్టాడు. ఈ నేపథ్యంలో జరిగిన పెద్దల సమావేశంలో పవన్‌కుమార్‌పై కనకదుర్గ కుటుంబీకులు దాడి చేశారు. ఈ సంఘటన 2022 జూలై నెలలో జరిగిందని ఎస్సై చెప్పారు.

ఎస్పీకి అంగన్‌వాడీ సహాయకురాలి ఫిర్యాదు

ఇదే వివాదంలో గ్రామ అంగన్‌వాడీ సహాయకురాలు (ఆయా) కోమటిలంక దుర్గాభవాని స్పందనలో జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసింది. అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ కనకదుర్గ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతోందని, తనను కూడా అలా చెయ్యమని ఒత్తిడి చేస్తోందని ఫిర్యాదులో పేర్కొంది.

అంగన్‌వాడీ కేంద్రానికి తాళం

గూడపల్లి గ్రామస్తులు అంగన్‌వాడీ కేంద్రానికి తాళం వేసినట్లు రాజోలు ఐసీడీఎస్ సీడీపీఓ వైకేడీ రమాదేవి ఆదివారం తెలిపారు. టీచర్ కనకదుర్గ కొన్ని నెలలుగా ఉద్యోగానికి దూరంగా ఉండడంతో తాము షోకాజ్ నోటీసు ఇస్తే కోర్టు ద్వారా ఉద్యోగం పొందినట్లుగా ఒక ఆర్డర్‌తో శనివారం విధుల్లో చేరేందుకు వెళ్లారని ఆమె తెలిపారు. దీంతో గ్రామానికి చెందిన మహిళలు అడ్డుకుని తాళం వేసి వెనక్కి పంపేశారని ఆమె తెలిపారు. ఈ మేరకు పోలీసులకు సమాచారం ఇచ్చామని కూడా ఆమె తెలిపారు. దీనిపై పోలీసుల సోమవారం విచారణ చేస్తామని ఆమె అన్నారు.

14న ఆర్చరీ పోటీలు

పిఠాపురం: ఈ నెల 14న రాజమహేంద్రవరం చెరుకూరి వల్లా ఆర్చరీ శిక్షణ కేంద్రంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు తూర్పుగోదావరి జిలా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు జేఎస్ఎస్ గోపాలకృష్ణ, లక్ష్మణరావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. మహిళలు, పురుషులకు నిర్వహించనున్న ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఆధార్‌కార్డు, పుట్టినరోజు ధ్రువపత్రం తీసుకురావాలని వారు తెలిపారు. ఇండియన్ రౌండ్, రికర్వ్ కాంపౌండ్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9989001162 నంబర్‌లో సంప్రదించాలని వారు సూచించారు.